అర్హులైన లబ్ధిదారులకే టిడ్కో గృహాలు

- టీడీపీ హయాంలో 300 మందికిపైగా నకిలీ లబ్ధిదారులు
- ఆధారాలు కోర్టు ముందు ఉంచుతాం: ఎమ్మెల్యే గోపిరెడ్డి
- రూ.4.5 కోట్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన


టిడ్కో గృహాల వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు

నరసరావుపేట: గత ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహాలు కేటాయించిన లబ్ధిదారుల్లో అర్హులైన నిజమైన లబ్ధిదారులకే గృహాలు కేటాయించటం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం చిలకలూరిపేట రోడ్డు టిడ్కో గృహాల వద్ద లబ్ధిదారుల కోసం రూ.4.5 కోట్ల వ్యయంతో నిర్మించే 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో లబ్ధిదారుల అవసరాల మేరకు కోట్ల వ్యయంతో తాగునీరు, డ్రెయిన్లు వసతి కల్పించామన్నారు. మెయిన్‌రోడ్డు నుంచి సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు మధ్యలో కాలువపై బ్రిడ్జి నిర్మాణం కూడా చేయటం జరిగిందన్నారు. ఇప్పుడు రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోయాయన్నారు. ఇటీవల టిడ్కో గృహాలపై టీడీపీ నాయకుడు అరవిందబాబు చేసిన ఆరోపణలను ఎమ్మెల్యే ప్రస్తావిస్తూ మొత్తం 1504 టిడ్కో గృహాల్లో గత ప్రభుత్వంలో కేవలం 1100 మందికే కేటాయించటం జరిగిందన్నారు. వీరిలో మొదటి ఫేజ్‌కింద 625 మంది నిజమైన అప్పటి లబ్ధిదారులుగా అధికారులు నిర్ధారించి ప్లాట్లు అప్పచెప్పటం జరిగిందన్నారు. మిగతా వారిలో సుమారు 300 మందికి పైగా టిడ్కో గృహాలు పొందేందుకు అనర్హులుగా గుర్తించారన్నారు. వీరందరికీ చుట్టుప్రక్కల గ్రామాల్లో నివాసితులై సొంత గృహాలు, పొలాలు కలిగి ఉన్నారన్నారు. మరికొందరు అప్పుడు చెల్లించాల్సిన డిపాజిట్లు కూడా చెల్లించలేదన్నారు. వీరందరి పేర్లతో సహా కోర్టుకు అందజేస్తామన్నారు. అరవిందబాబుకు నాలెడ్జ్ లేకుండా అరబందపు బాబు లాగా మాట్లాడుతున్నాడని విమర్శించారు. టీడీపీ నాయకులు ఇచ్చిన దొంగ లబ్ధిదార్లను తొలగించామని, అన్నీ వివరాలతో కోర్టులో కౌంటర్ దాఖలు చేసి సాక్ష్యాలు కోర్టుకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పౌడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మాజేటి సాంబశివరావు, విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎన్.శ్రీనివాసరావు, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వై.ఏడుకొండలు, విద్యుత్ శాఖ అకౌంటెంట్ ఆర్.బంగారయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు జి.అచ్యుతరావు, టిడ్కో అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చక్కని వేదిక

- గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు


పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ (నూజెండ్ల): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని తెలుసుకొని సమస్యలు పరిష్కరించడమే గడపగడపకు మన ప్రభుత్వం ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. రూరల్ పరిధిలోని పెదకంచర్ల గ్రామంలో రెండవ రోజు గురువారం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలసి గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రచారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల గ్రామాలకు సైతం సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత తమదేనన్నారు. విద్య ద్వారానే పేదప్రజల జీవితాల్లో మార్పు వస్తుందని గుర్తించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి, జగనన్న దీవెన, విద్యాదీవెన పథకాలను ప్రవేశపెట్టారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఎన్నో పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో గ్రామసచివాలయాలు, రైతులు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన పరిపాలన అందిస్తున్నట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉండి వినుకొండకు చెప్పుకోదగ్గ ఏ ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదని, తాము చేస్తున్న అభివృద్ధి పథకాలను తన అనుచరుల ద్వారా కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో వినుకొండ రామలింగేశ్వరస్వామి దేవాలయానికి ఘాట్‌రోడ్డు నిర్మాణం, మున్సిపల్ కాంప్లెక్స్, స్టేడియం, వినుకొండకు సింగరచెరువు అభివృద్ధి ద్వారా శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు గుండ్లకమ్మ నదిపై వంతెనలు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, అగ్రహారం భూముల సర్వే వంటి అనేక అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగించుకుని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దండు చెన్నయ్య, ఎంపీపీ జయశ్రీ వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, తహసీల్దార్ కిరణ్‌కుమార్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేజీబీవీ వసతి గృహాల్లో ఉపాధ్యాయులుగా కొనసాగించండి



నరసరావుపేట: జిల్లాలో ప్రభుత్వ సహకారంతో కేజీబీవీ వసతి గృహ పాఠశాలల్లో పనిచేస్తున్న తమను ఉపాధ్యాయ విధుల నుంచి తొలగించవద్దని కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ స్కూల్ టీచర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను కోరారు. గురువారం కలెక్టర్‌ను 30 మంది టీచర్లు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఇటీవల ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్ పద్ధతిలో టీచర్లు, వార్డెన్లుగా పనిచేస్తున్న వారిపై పర్మినెంట్ చర్యలు చేపట్టిందన్నారు. తమను కూడా ఉపాధ్యాయ విధుల్లో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని, తమకు ఉద్యోగ అవకాశాలను కొనసాగించాలని మహిళా ఉపాధ్యాయులు కలసి విజ్ఞప్తి చేశారు.

పూర్ణనంద స్వామిని కఠినంగా శిక్షించాలి



చిలకలూరిపేట: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన పూర్ణనందస్వామిని కఠినంగా శిక్షించాలని మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల డిమాండ్ చేశారు. మైనర్ బాలికపై పూర్ణనందస్వామి లైంగిక దాడిని నిరసిస్తూ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ స్వామీజిల వేషంలో మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడడం అత్యంత విచారకరమన్నారు. ఇలాంటి వారిని సంఘ బహిష్కరణ చేయాలని కోరారు. మహిళల రక్షణకు కొత్త చట్టాలు వస్తున్నా మృగాళ్ల దుశ్చర్యలు ఆగకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ, లలితకుమారి, రమణమ్మ, పావని తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో మోస్తరు వర్షం

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసాయి. గురువారం ఉదయానికి 6.2 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయం అధికారులు తెలిపారు. ఉదయం నుండి ఆకాశం మేఘావృతమై అప్పుడప్పుడు ఓ మోస్తరు వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. నిన్నా, మొన్నటి వరకు తీవ్రంగా కాసిన ఎండలకు తల్లడిల్లిన మండల ప్రజలకు ఈ వర్షాలు ఉపశమనాన్ని ఇచ్చాయి. దుక్కిపాటి పదును అయ్యే వర్షాలు పడటంతో వ్యవసాయ పనులు కూడా ప్రారంభం కానున్నట్లు రైతులు తెలిపారు.

వడ్డీలేకుండా ఆస్తిపన్ను చెల్లించండి

నరసరావుపేట: 2023–24 మొదటి అర్ధసంవత్సరానికి చెల్లంచాల్సిన ఆస్తి, ఖాళీ స్థలాలు, నీటి పన్నులను ఈనెలాఖరులోగా చెల్లించిన వారికి మాత్రమే వడ్డీ రాయితీ లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ జి.రామ్మోహన్ గురువారం వెల్లడించారు. వచ్చే నెల నుంచి చెల్లించే వారు నూటికి రూ.2లు చొప్పున వడ్డీతో చెల్లించాల్సివస్తుందన్నారు. అందువలన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఈనెలాఖరులోగా చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

నరసరావుపేట రూరల్: మండలంలోని ఉప్పలపాడు సమీపంలో గురువారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. వినుకొండ నుంచి నరసరావుపేట వస్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ, బస్సు డ్రైవర్లతో పాటు ఆర్టీసీ బస్సులోని ప్రయాణీకులకు స్వల్ప గాయాలయ్యాయి. రోడ్డుకు అడ్డంగా ఆర్టీసీ బస్సు, లారీ నిలిచిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. రూరల్ ఎస్ఐ బాలనాగిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

రేపు నెలనెలా సాహిత్య మేళ

నరసరావుపేట: నెలనెలా.. సాహిత్య మేళా కార్యక్రమం ఈనెల 24 శనివారం సాయంత్రం పట్టణంలోని భువనచంద్రటౌన్ హాలులో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఆధునిక సమాజంపై శ్రీ శ్రీ మహాప్రస్థాన ప్రభావం అనే అంశంపై సాహిత్య చర్చ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రధాన వక్తగా అభ్యుదయ రచయితల సంఘం, మాజీ జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ పాల్గొంటారన్నారు. విశిష్ట అతిధులుగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, శాసనమండలి సభ్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ హాజరవుతారని వెల్లడించారు. కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని జిల్లా కలెక్టర్ తెలియజేశారు.

జగనన్న సురక్ష పథకం షెడ్యూలు విడుదల

శావల్యాపురం: మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలోని అర్హత కలిగిన లబ్ధిదారులందరు జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి. సీతారామయ్య తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 23న జగనన్న సురక్ష పథకాన్ని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆరంభిస్తారని చెప్పారు. కార్యక్రమానికి సంబంధించి ఎంపీడీవో, తహసీల్దారు మండల స్థాయి అధికారుల సారథ్యంలో రెండు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామ సచివాలయాల వారీగా ఆగస్టు నెలలో 1న కనమర్లపూడిలో, 4న వేల్పూరు 1–2 గ్రామసచివాలయాలు, 11న పిచికలపాలెం, 13న పోట్లూరు, 15న గుంటుపాలెం, 22న కారుమంచి, 25న కొత్తలూరులో, 27న మతుకుమల్లిలో 27న, శానంపూడిలో 19న, శావల్యాపురంలో 17వ తేదీన నిర్వహిస్తామన్నారు. గ్రామసచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష పథకం అన్నీ మండల శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు సమక్షంలో జరుగుతాయన్నారు. జగనన్న సురక్షా పథకానికి సంబంధించి ప్రారంభించిన వారం రోజుల వ్యవధిలో ఇంటింటి సర్వే చేసి వలంటీర్లు ప్రభుత్వ యాప్‌లో నమోదు చేయాలన్నారు. కుల, ఆదాయ, ఫ్యామిలీ, వివాహ ధ్రువీకరణ పత్రాలతో పాటు నేటికీ సంక్షేమ పథకాలు మంజూరు కాని వారందరూ సమగ్ర ఆధారాలతో వలంటీర్లు యాప్‌లో నమోదు చేయించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రకటించిన గ్రామ సచివాలయాల్లో వలంటీర్లు ప్రభుత్వ యాప్‌లో నమోదు చేసిన అర్హత కలిగిన లబ్ధిదారులకు నగదు రహిత ధ్రువీకరణ పత్రాలు అదేరోజువరకు మాత్రమే మంజూరు చేస్తామన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన



మాట్లాడుతున్న ప్రభాకర్

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎస్ఎస్‌పీ కాలనీలో గల పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, వలంటీర్స్‌కు లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్‌పై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ పి. ప్రభాకర్ మాట్లాడుతూ లెప్రసీ మైకో బ్యాక్టీరియా లేప్రె అను సూక్ష్మ క్రిమి వలన ఈ వ్యాధి వస్తుందని, ఈ నెల 26వ నుంచి వచ్చే నెల 16వ తారీకు వరకు జరిగే కార్యక్రమాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి ఆరోగ్య కార్యకర్త, ఆశ, వలంటీర్స్ ప్రతి ఇంటినీ సందర్శించాలని, చర్మాలపై రాగి రంగు స్పర్శ లేని మచ్చలు ఉంటాయని, కనుబొమ్మలు, కనురెప్పలపై వెంట్రుకలు రాలిపోవడం, కాళ్లు చేతులు తిమ్మిర్లు కలిగి ఉండటం, తెలియకుండానే కాళ్లు చేతులలో బొబ్బలు రావడం, చేతివేళ్లు, కాలి వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం కుష్ఠువ్యాధి లక్షణాలని గుర్తించాలన్నారు. అనుమానితులు వెంటనే తగిన పరీక్షలు చేయించుకుని బహుళ ఔషధ చికిత్స పూర్తి చేసినట్లయితే నయమవుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ పర్వీన్ బేగం, డాక్టర్ కౌశిక్, పి.ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌వీ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ అలవెన్స్‌లు ఇప్పించండి

నరసరావుపేట: స్థానిక పురపాలకసంఘంలో పనిచేస్తున్న 300 మంది కార్మికులకు మూడు నెలలుగా నిల్పిన హెల్త్ అలవెన్స్‌లను మంజూరు చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం పురపాలకసంఘ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన చేసి కార్యాలయ సూపరిండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిమెంట్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు షేక్ శిలార్ మసూద్, టి.మల్లయ్య, ఏ.సాల్మన్, పిట్టా ఏసు, కె.వసంత పాల్గొన్నారు.

గణపవరం రామాలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

నాదెండ్ల: గణపవరం గ్రామంలో రూ.2.5 కోట్ల వ్యయంతో నిర్మితమైన రాతి రామాలయ ప్రతిష్ట ఈ నెల 7న వైభవంగా జరిగిన విషయం విదితమే. ప్రతిష్ట మహోత్సవానికి త్రిదండి చినజీయర్ స్వామి, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. గురువారం నాటికి ఆలయప్రతిష్ట జరిగిన పదహారు రోజులు పూర్తయిన సందర్భంగా స్వామి వార్లకు ఆలయ ప్రధాన పూజారి దర్శి నాగసాయి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గణపవరానికి చెందిన గీతా సమాజం వారిచే లలితా, విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. ప్రతిష్ట జరిగిన మరుసటి రోజు నుంచి నేటి వరకూ ప్రతి రోజూ వివిధ ప్రాంతాల వారిచే భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జులై 17న ఆలయ ప్రతిష్ట జరిగి 41 రోజుల కానున్నందున ఆలయంలో స్వామివార్లకు కళ్యాణం, పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పాఠశాలల బలోపేతానికి సహకరించాలి


సదస్సులో మాట్లాడుతున్న ఎంఈఓ

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో బలోపేతానికి ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు అన్నారు. గురువారం స్థానిక మండల వనరుల కేంద్రంలో మండలంలోని 39 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ 2023–24 నూతన విద్యాసంవత్సరంలో అన్నీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపుదలతో పాటు జగనన్న గోరుముద్ద కార్యక్రమం పారదర్శకంగా అమలు జరిగేలా క్షేత్ర స్థాయిలో ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. జగనన్న విద్యాకానుక కిట్లు 2908 మంది విద్యార్థులకు మంజూరు చేసిందన్నారు. నాడు–నేడు మనబడి పథకంలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ చోటు చేసుకుందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈఓ–2 పుసులూరి లలితాకుమారి, జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి.విజయలక్ష్మి, సుభాని, అన్నపూర్ణమ్మ, కృష్ణతులసి, సీఆర్‌పీలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆనర్స్ డిగ్రీ కోర్సుపై అవగాహన సదస్సు

వినుకొండ టౌన్: యూజీసీ, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆదేశాల మేరకు, దేశ వ్యాప్తంగా 2023– 24 విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ కోర్సును అమలు పరుస్తున్న నేపథ్యంలో, తమ కళాశాలలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.యోగయ్య గురువారం తెలియచేశారు. మారిన డిగ్రీ విద్యా విధానంపై తమ కళాశాలలో ఈ నెల 24న ఉదయం 10 గంటలకు జరిగే సదస్సులో ఆయా సబ్జెక్ట్ నిపుణులు అనేక విషయాలు తెలియచేయడం జరుగుతుందన్నారు. విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 8885200889 నెంబరుకు సంప్రదించాలన్నారు.

బాలబాలికలకు కిట్లు పంపిణీ

శావల్యాపురం: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల కలిగిన బాలబాలికలకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హ్యాండీకాప్డ్, సమగ్ర శిక్షా వారి సౌజన్యంతో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఫ్రీ ఒకేషనల్ కిట్స్ 40 వేలు విలువ చేసే కిట్లు బాలబాలికలకు ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు గురువారం అందజేసినట్లు భవిత సెంటరు ఉపాధ్యాయులు కె.జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ–2 పుసులూరి లలితాకుమారి, పార్వతీ, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయకు నలుగురు రొంపిచర్ల విద్యార్థులు


పోలిశెట్టి త్రినాథ్ | నారే కీర్తి | అంగలూరి శ్రీభవ్య | తోడేటి అభిషేక్

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల కేరళ మోడల్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు నవోదయ విద్యకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గెల్లి గాలిరెడ్డి గురువారం తెలిపారు. ఇటీవల జరిగిన నవోదయ ప్రవేశ పరీక్షలో తమ పాఠశాలకు చెందిన పోలిశెట్టి త్రినాథ్, నారే కీర్తి, అంగలూరి శ్రీభవ్య, తోడేటి అభిషేక్‌లు ఉత్తీర్ణులై 6వ తరగతి ప్రవేశానికి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

సీసీఆర్‌సీ కార్డులతో ప్రయోజనాలు

నరసరావుపేట రూరల్: సీసీఆర్‌సీ కార్డులను అర్హులైన రైతులందరూ పొందాలని దళిత బహుజన రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప తెలిపారు. మండలంలోని జొన్నలగడ్డ, ములకలూరు గ్రామాల్లో దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో కౌలు రైతుల ప్రచార ఉద్యమం గురువారం నిర్వహించారు. సీసీఆర్‌సీ కార్డులను పొందితే కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా దళిత బహుజన రీసోర్స్ సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు పొందడం ద్వారా ఆర్‌బీకేల నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, బ్యాంక్ రుణాలు పొందవచ్చన్నారు. కౌలు రైతులు తాము వేసిన పంటలను ఈక్రాప్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ గ్రామ సర్పంచ్ కుందా చిన్నా, దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఏరియా కోఆర్డినేటర్ వేణు, పంచాయతీ కార్యదర్శి రామసీత, మహిళా పోలీస్ శాంభవి, ఎంఎల్‌ఓ వెంకటేశ్వర్లు, రైతులు, వలంటీర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నాదెండ్ల: చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలో 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు కోరబడుతున్నట్లు ప్రిన్సిపల్ ఝాన్సీ వాణి తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఈ నెల 24 లోపు అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను స్వయంగా పాఠశాలలో సమర్పించాలన్నారు. అనంతరం సీట్ల భర్తీ చేసేందుకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్ల పంపిణీ జరుగుతుందన్నారు. 7, 8, 9 తరగతుల్లో మొత్తం 42 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

నేడు జగనన్న సురక్ష ప్రారంభం

నాదెండ్ల: జగనన్న సురక్ష పథకాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రతి సచివాలయంలో గానీ రైతు భరోసా కేంద్రంలో గానీ ప్రత్యక్ష ప్రసారం జరుగుతుందని ఎంపీడీవో జాకీర్ హుస్సేన్ తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారధులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమం జులై 1 నుంచి నెల చివరి వరకూ జరుగుతుందన్నారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాలకు సంబంధించిన 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.

25న లింగారావుపాలెంలో వైద్యశిబిరం

యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెం గ్రామంలో ఈనెల 25వ తేదీన వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు సామినేని శ్రీనివాసరావు, ముత్తవరపు రవీంద్ర, గోనుగుంట్ల కిరణ్ తెలిపారు. జీబీఆర్, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్, జనవిజ్ఞాన వేదిక, యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఉదయం 6 గంటలకు శిబిరం ప్రారంభం అవుతుందన్నారు. ఆలోకం వెంకాయమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరం నిర్వహణకు ఆమె భర్త ఆలోకం పెద్దబ్బాయి ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు వెల్లడించారు. శిబిరంలో డాక్టర్ గోపాళం శివన్నారాయణ, డాక్టర్ డీవై రెడ్డి, డాక్టర్ మత్రి పెద్దయ్య పాల్గొని బీపీ, షుగర్, ఫిట్స్, పక్షవాతం, గుండె, కిడ్నీ, కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామస్తులతో పాటు సమీప గ్రామాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యడ్లపాడు గ్రామంలోని పీఆర్ విజ్ఞాన కేంద్రం నుంచి లింగారావుపాలెంకు వేకువ జామున 5.30 గంటలకు ఉచిత బస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షుగర్ వ్యాధిగ్రస్తులు తమ పాత రిపోర్టును తీసుకు రావాలని తెలిపారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సత్తెనపల్లి: పట్టణంలో ఖాళీగా ఉన్న ఆరు వార్డు వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వా నిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి గురువారం తెలిపారు. పట్టణంలోని కంబాల భావి ఎరియాలో ఒకటి, కొత్తపేట ఏరియాలో రెండు, వెంగళ రెడ్డి నగర్ ఏరియాలో మూడు వెరసి ఆరు వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ పోస్టులకు ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని, 26న దరఖాస్తుల పరిశీలన, 27న సెలక్షన్ కమిటీ వారిచే మౌఖిక పరీక్ష, 28న వలంటీర్లు ఎంపిక వివరాలు తెలియజేయడం జరుగుతుందన్నారు. 29న శిక్షణ తరగతుల నిర్వహించి, ఈ నెల 30 నుంచి వలంటీర్లు విధులకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. పదవ తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆధార్ కార్డులోని పుట్టిన తేదీ, 10వ తరగతి సర్టిఫికెట్ లోని పుట్టిన తేదీ ఒకటై ఉండాలన్నారు. వార్డు వలంటీర్లుగా దరఖాస్తు చేసుకునేవారు సత్తెనపల్లి పురపాలక సంఘ పరిధిలో నివసించు వారై ఉండాలన్నారు. 2023 జూన్ 27 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారై, 35 సంవత్సరాలు దాటని వారై ఉండాలన్నారు. పురపాలక సంఘాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి ఆర్ఓఆర్ ప్రకారం నియామకం జరుగుతుందన్నారు. మహిళలకు దాదాపు 50 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయన్నారు. క్రమశిక్షణతో మెలు గుతూ నిజాయితీగా సేవ చేయదలసిన నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తుతో పాటు ఆధార్ నంబర్, విద్యార్హతల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీ కరణ పత్రం, తదితర ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

సత్తెనపల్లిలో జోరు వర్షం


పట్టణంలోని సుందరయ్య కాలనీలో వర్షపునీరు

సత్తెనపల్లి: పట్టణంలో గురువారం సాయంత్రం భారీ వర్షం జోరుగా కురిసింది. ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో కాలువల్లో మురుగు నీరు పొంగి పార్లింది. దీంతో పారిశుద్ధ్య సిబ్బంది అప్రమత్తం కావడంతో కొంత మేర ఇబ్బందులు తొలగాయి. ఇదిలా ఉంటే పట్టణంలోని 17, 19 వార్డుల్లోని శాలివాహన నగర్, సుందరయ్య కాలనీ లతోపాటు నాగన్నకుంట ఏరియాలో వర్షం నీరు పెద్ద ఎత్తున చేరింది. దీంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం లోతట్టులో ఉండడంతో వర్షం నీరు కార్యాలయంలో లోపలికి చేరడంతో సిబ్బందికి విధుల నిర్వహణకు ఇబ్బంది తప్పలేదు. కార్యాలయం మొత్తం నీరు నిలిచి ఉండడంతో వివిధ ధ్రువీకరణ పత్రాలు, ఫైళ్ళు తదితర వాటిని తడవకుండా ఎత్తు ప్రదేశంలో నిలిపారు. విధుల నిర్వహణకు తీవ్ర సౌకర్యానికి అధికారుల గురయ్యారు.

వర్షంతో రోడ్లన్నీ జలమయం

ముప్పాళ్ళ: ఆకాశం మేఘావృతంతో పాటుగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయ్యాయి. ఉదయం నుంచి ఎండవేడిమి, ఉక్కపోతతో అల్లాడుతున్న మండల వాసులకు వర్షంతో కొంత ఉపశమనం లభించినట్లయింది. దీంతో పాటుగా ఈదురుగాలులు కూడా తోడవడంతో రహదారి వెంబడి చెట్లు నేలకొరిగాయి. రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేవు. మండల కేంద్రమైన ముప్పాళ్ళ లోని ప్రదాన రహదారి వెంబడి ము రుగు కాల్వలు లేక పోవడంతో వర్షం నీరంతా రోడ్లపైనే ప్రవహించి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. గ్రామాల్లోని అంతర్గత రో డ్లు జలమయమయ్యాయి. వర్షం రాకతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పచ్చిరొట్ట పంటలు సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే విత్తనాలు కొనుగోలు చేశారు.

పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలి

క్రోసూరు: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన పశుబీమా పథకాన్ని మండలంలోని పశుపోషలకులందరూ సద్వినియోగపరుచుకుని ప్రభుత్వం నుంచి బీమా ప్రయోజనాలు పొందాలని మండల పశువైద్యులు డాక్టర్ మల్లయ్య గురువారం తెలిపారు. ఆయన వివరిస్తూ రాష్ట్రంలో పాడి రైతులు ,గొర్రెలు, మేకలు, పందులు, పెంపకందార్ల కోసం ఊరట కలిగిస్తూ నూతనంగా పశు బీమా పథకం ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఈ పథకంలో లబ్ధిదారుని వాటా ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ వారికి 20 శాతం వాటా, ఏపీఎల్ రైతులకు 50 శాతం వాటా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పథకంలో గరిష్ఠంగా ఒక కుటుంబం ఐదు గేదెలు, 50 గొర్రెలు, మేకలు, పందులు పశుబీమా చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆవు, గేదెలకు బీమా మొత్తం రూ.30 వేలు పథకానికి ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ కుటుంబాలు రూ.384 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అదే ఏపీఎల్ కుటుంబాలు రూ.960 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.15 వేల బీమాకు ఎస్సీ,ఎస్టీ, బీపీఎల్ వారు రూ.192 , ఏపీఎల్ కుటుంబాలు రూ.480 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈపథకం, మూడు సంవత్సరాల వ్యవధి ఉంటుందన్నారు.